క్లుప్తంగా

పేకాట స్థావరంపై దాడి

ముత్తుకూరు : మండలంలోని మునునూరువారిపాళెం గ్రామ శివారులో ఓ పేకాట స్థావరంపై మంగళవారం రాత్రి పోలీసులు దాడులు చేశారు. ఎస్సై శ్రీనివాసరెడ్డి కథనం మేరకు.. పేకాట స్థావరంపై జరిపిన దాడిలో ఆరుగురు పేకాట రాయుళ్లతో పాటు వారి నుంచి రూ.52,200ల నగదును స్వాధీనం చేసుకున్నామని వెల్లడించారు.

వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌పై సస్పెన్షన్ వేటు


బి.గోవర్ధన్‌రెడ్డి

విడవలూరు: వైఎస్సార్ సీపీ విడవలూరు మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తునట్లు ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పూండ్ల అచ్యుత్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడడంతో విచారణ జరిపి ఈ మేరకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు.

జాగ్రత్తలు తప్పనిసరి


మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

కోవూరు : డ్రైవింగ్ చేసే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని, లేకుంటే ప్రమాదాలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి తెలిపారు. కోవూరు మండలం పడుగుపాడులోని లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో భద్రతపై అవగాహన కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డ్రైవింగ్‌లో ఉన్నప్పుడు ఇంట్లోని వారిని గుర్తు చేసుకుని వాహనాలు నడపాలని సూచించారు. నిర్లక్ష్యపు డ్రైవింగ్ వల్లే అధిక ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడపడం చాలా ప్రమాదకరమన్నారు. తగిన జాగ్రత్తల ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలియజేశారు. కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వై.పూర్ణచంద్రరావు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చిన్నారెడ్డి, ఖాదర్, వైస్ ప్రెసిడెంట్ స్వామినాయుడు, దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి


యూనియన్ సభ్యత్వ కార్డులను ఆవిష్కరిస్తున్న నాయకులు

మనుబోలు : డ్రైవర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని న్యూ హెచ్‌ఎంసీ మినీ ట్రక్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ స్టేట్ బోర్డ్ మెంబర్ నాగూర్ బాషా అన్నారు. స్థానిక వైఎస్సార్ కూడలి వద్ద న్యూ హెచ్‌ఎంసీ మినీ ట్రక్ యూనియన్ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టాలతో డ్రైవర్లు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, వాటి పరిష్కారానికి తమ యూనియన్ కృషి చేస్తోందన్నారు. రహదారి మార్గంలో ఏమైనా ప్రమాదాలు, ఇతర సమస్యలు ఎదురైతే వెంటనే సంబంధిత జిల్లా యూనియన్ సభ్యులు అక్కడికి చేరుకుని డ్రైవర్లకు సాయం అందజేస్తారని తెలిపారు. సమావేశంలో యూనియన్ నేతలు కృష్ణయ్య, కాజా మహమ్మద్, వలిపి శ్రీనివాసులు, కోటి అమర, భాస్కర్, వెంకీ, బాలయ్య, మహేష్, అంకయ్య, సుజిత్ పాల్గొన్నారు.

మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

నెల్లూరు(వేదాయపాళెం): మాదిగలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలనే డిమాండ్‌తో వచ్చే నెలలో నగరంలో మాదిగల రాజకీయ గర్జన నిర్వహించనున్నట్లు మన ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లాల శ్రీనివాసులు తెలిపారు. దర్గామిట్టలోని అంబేడ్కర్ భవన్‌లో మన ఎమ్మార్పీఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని, మాదిగ కార్పొరేషన్‌కు నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

నెల్లూరు రూరల్: పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన దేవరపాళెం గిరిజన కాలనీకి చెందిన పిట్టా చెంచురామయ్య(51) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వివరాలు.. చెంచురామయ్య మొదటి భార్యను వదిలేసి భర్తను వదిలేసిన మరో మహిళతో సహజీవనం చేస్తున్నాడు. వీరికి సంతానం లేదు. చెంచురామయ్య చిత్తు కాగితాలు సేకరిస్తూ, కూలి పనులకు వెళుతూ జీవనం సాగించేవాడు. ఇటీవల మద్యానికి బానిసయ్యాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 11న భార్యను మద్యానికి నగదు ఇవ్వాలని కోరగా ఆమె నిరాకరించింది. దీంతో మద్యంలో పురుగు మందు కలుపుకుని తాగాడు. పరిస్థితిని గమనించిన కుటుంబ సభ్యులు నెల్లూరులోని జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. బుధవారం రూరల్ పోలీసులకు సమాచారం అందడంతో ఆస్పత్రి వద్దకు చేరుకుని విచారించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జనరంజక పాలనను ఆదరించండి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి


నూతన పశువైద్యశాలను ప్రారంభిస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : పేదల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా జనరంజక పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు ఆదరించాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నచెరుకూరు గ్రామంలో రూ.26.50 లక్షలతో నిర్మించిన గ్రామీణ పశువైద్యశాలను మంత్రి కాకాణి బుధవారం సాయంత్రం ప్రారంభించారు. అలాగే పంచాయతీ పరిధిలోని 97 కుటుంబాలకు అసైన్‌మెంట్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాకాణి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో 99 శాతం మేర అమలు చేసి సీఎం జగన్ చరిత్రలో నిలిచిపోయారన్నారు. మీ కుటుంబంలో మేలు జరిగితేనే అండగా నిలవండి అంటూ ధైర్యంగా చెబుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతు పలకాలని కోరారు. గతంలో రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తానని అధికారంలోకి వచ్చిన చంద్రబాబు అందరినీ మోసం చేశారని, మరలా మోసం చేసేందుకు అనేక హామీలు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రజలు వాటిని నమ్మవద్దని కోరారు. సర్వేపల్లిలో టిక్కెట్ దక్కుతుందో లేదో తెలియని సోమిరెడ్డి అసహనంతో పిచ్చికూతలు కూస్తూ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి తలమంచి సురేంద్రబాబు, వైస్ ఎంపీపీ చెరుకూరు శ్రీనివాసులునాయుడు, స్థానిక నేతలు కోడూరు పురంధర్‌రెడ్డి, కోడూరు విష్ణువర్ధన్‌రెడ్డి, సన్నపురెడ్డి సురేంద్రరెడ్డి, వేమారెడ్డి సుధీర్‌రెడ్డి, పుట్టా భాస్కర్, కె.శీనయ్య పాల్గొన్నారు.

గొలగమూడి పాఠశాలలో సరస్వతీపూజ


సరస్వతీపూజ చేస్తున్న ప్రిన్సిపల్ కొండల్‌రావు, సిబ్బంది

వెంకటాచలం: మండలంలోని గొలగమూడి వద్ద నున్న మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ బాలికల పాఠశాలలో బుధవారం సరస్వతీ పూజ నిర్వహించారు. తొలుత సరస్వతీ దేవి చిత్రపటానికి ప్రిన్సిపల్ కొండల్‌రావు, ఉపాధ్యాయ సిబ్బంది పూలమాల వేసి పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉన్నత చదువులు అభ్యసించాలని సూచించారు. పోటీతత్వంతో చదివితే మంచి ఫలితాలు సాధిస్తారని తెలియజేశారు.

పంట నమోదుతో బహుళ ప్రయోజనాలు

- ఏడీఏ సుజాత


రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ సుజాత

కొడవలూరు: పంట నమోదుతో రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని ఏడీఏ డి.సుజాత సూచించారు. మండలంలోని బసవాయపాళెం, తలమంచి గ్రామాల్లో బుధవారం ఆమె పర్యటించి పంట నమోదు సూపర్ చెక్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంట నమోదు వల్ల పంట నష్టం, బీమా, కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయాలు, పంట రుణాలు తదితర బహుళ ప్రయోజనాలున్నాయని తెలిపారు. పంట నమోదు చేసుకున్న పలువురు రైతులు ఈ–కేవైసీ చేయించుకోవడంలో జాప్యం చేస్తున్నారన్నారు. పంట నమోదు కాని రైతులు వీఏఏను సంప్రదించి వెంటనే చేయించుకోవాలన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిరైతు విధిగా పంట నమోదు, ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. అనంతరం ఆమె బసవాయపాళెంలో జీవన ఎరువులతో సాగు చేస్తున్న వరి పంటను పరిశీలించారు. మార్కెట్‌లో ఈ రకం ధాన్యాన్ని మంచి ధరకు విక్రయించుకునే వెసులుబాటు ఉండడంతో పాటు ఎరువులు, పురుగు మందుల ఖర్చు గణనీయంగా తగ్గుతుందని స్పష్టం చేశారు. ఏడీఏ వెంట ఏఓ లక్ష్మి, వీఏఏలు ఎస్.ప్రసాద్, బి.లిఖిత ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ విజయం తథ్యం


ఇంటింటి ప్రచారం చేస్తున్న జెడ్పీటీసీ నిర్మలమ్మ, నాయకులు

పొదలకూరు : రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని జెడ్పీటీసీ సభ్యురాలు తెనాలి నిర్మలమ్మ అన్నారు. పొదలకూరు పంచాయతీ వెంకటేశ్వరనగర్(తోకంచి)లో వరుసగా మూడో రోజు ఇంటింటి ప్రచారాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే తమ స్టార్ క్యాంపెయినర్లు అని, మూడో పర్యాయం మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సర్వేపల్లి నుంచి అత్యధిక మెజారిటీతో విజయం సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు గుంటి శ్రీనివాసులు, నాయకులు వెంకీ, రామచంద్రయ్య, భారతమ్మ పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి


పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే ప్రసన్న

విడవలూరు: వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మండలంలోని వావిళ్ల గ్రామానికి చెందిన 50 మంది టీడీపీ కార్యకర్తలు బుధవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. స్థానిక భద్రాచలం పాత సినిమాహాల్ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రసన్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధికి ఆకర్షితులై పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, పార్టీ నేతలు కొండూరు లక్ష్మీనారాయణరెడ్డి, ప్రవీణ్‌కుమార్, పోలయ్య, శీనయ్య, సుధాకర్, సురేంద్రరెడ్డి, ప్రసాద్, తిరుపతయ్య పాల్గొన్నారు.

ప్రజాభీష్టం మేరకే దేవాలయాల నిర్మాణం


పేడూరులో చెన్నకేశవాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కాకాణి

తోటపల్లిగూడూరు : ప్రజాభీష్టం మేరకే నియోజకవర్గంలో పెద్ద ఎత్తున దేవాలయాలను నిర్మిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని పేడూరు పంచాయతీలో చెన్నకేశవాలయ నిర్మాణానికి సంబంధించి భూమి పూజ కార్యక్రమంలో మంత్రి కాకాణి బుధవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీటీడీ మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో పేడూరు పంచాయతీలో చెన్నకేశవాలయాన్ని నిర్మిస్తున్నామన్నారు. ఇందుకు సహకరించిన టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈఓ ధర్మారెడ్డికి మంత్రి కాకాణి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డెయిరీ డెవలప్‌మెంట్ కో–ఆపరేటివ్ ఫెడరేషన్ చైర్మన్ చిల్లకూరు సుధీర్‌రెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు ఉప్పల శంకరయ్యగౌడ్, పేడూరు సొసైటీ అధ్యక్షుడు తూపిలి ఉదయ్‌కుమార్‌రెడ్డి, నాయకులు తిక్కవరపు సనత్‌కుమార్‌రెడ్డి, ఆగాల శ్రీనివాసులురెడ్డి, ఈదూరు రమేష్, సాదేపల్లి సామ్సన్ పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా పరిశీలన



మనుబోలు : మండలంలోని కొలనకుదురు గ్రామంలో జరుగుతున్న ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియను తహసీల్దార్ చిరంజీవి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించాలని బీఎల్వోలకు సూచించారు. కొత్త ఓట్ల నమోదుకు సమయం ఉందని, అర్హులైన దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి రేష్మసోని ఉన్నారు.

నేడు విరువూరుకు మంత్రి కాకాణి

పొదలకూరు : రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి గురువారం ఉదయం 9 గంటలకు విరువూరు గ్రామానికి వస్తారని ఎంపీడీఓ మహ్మద్‌రఫీ బుధవారం తెలిపారు. గ్రామంలో రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన, సీసీ డ్రెయిన్లు, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. మండల స్థాయి అధికారులు హాజరు కావాల్సిందిగా సూచించారు.

నేడు ఎంపీ ఆదాల, ఎమ్మెల్యే ప్రసన్న రాక

ఇందుకూరుపేట : నెల్లూరు ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి గురువారం మండలంలోని ఆరో మైలులో పర్యటించనున్నారని వైఎస్సార్‌సీపీ నేత దువ్వూరు కళ్యాణ్‌కుమార్‌రెడ్డి బుధవారం తెలిపారు. మైపాడు– నెల్లూరు రోడ్డు విస్తరణకు వారు శంకుస్థాపన చేస్తారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి తీవ్రగాయాలు

పొదలకూరు : స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మొగళ్లూరు గ్రామానికి చెందిన వృద్ధురాలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని సీహెచ్‌సీలో కంటి అద్దాలు తీసుకునేందుకు సుబ్బరత్నమ్మ(72) బస్సుదిగి రోడ్డు దాటుతుండగా మోటారు బైక్ ఢీకొంది. లింగంపల్లితోపునకు చెందిన యువకుడు ట్రిబుల్‌రైడింగ్ చేస్తూ వృద్ధురాలిని ఢీకొన్నట్లుగా తెలుస్తోంది. ప్రమాదంలో సుబ్బరత్నమ్మ కాలు నుజ్జు నుజ్జు అయ్యింది.

తిరుపతిని రాజధానిగా ప్రకటించాలి

- మాజీ ఎంపీ చింతా మోహన్

పొదలకూరు : తిరుపతిని ఏపీ రాజధానిగా ప్రకటించాలని కాంగ్రెస్ పార్టీ మాజీ ఎంపీ చింతా మోహన్ డిమాండ్ చేశారు. పొదలకూరు పట్టణంలో బుధవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజధానికి తిరుపతి అన్నివిధాలుగా అనుకూలంగా ఉంటుందన్నారు. గతంలో ఎన్జీ రంగా తిరుపతిని రాజధానిగా నిర్ణయిస్తే నీలం సంజీవరెడ్డి కర్నూలుకు తరలించినట్లు చెప్పారు. ప్రజలు కాంగ్రెస్‌పార్టీ వైపు ఉన్నారని పేర్కొన్నారు. ఆయన వెంట పార్టీ నేతలు చంద్రశేఖర్, విజయబాబు, మస్తాన్‌రెడ్డి ఉన్నారు.

దేవస్థానంలో వసంత పంచమి

పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్‌లో ఉన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వసంత పంచమి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సరస్వతీదేవికి ప్రత్యేక పూజలు చేసి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. పట్టణంలోని శిరిడీ సాయిబాబా మందిరంలో వసంతపంచమి వేడుకల సందర్భంగా మందిర సేవా సమితి సొసైటీ వారు చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. అనంతరం పిల్లలకు విద్యాసామగ్రిని అందజేశారు.

కారు దగ్ధం



పొదలకూరు : పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో బుధవారం తెల్లవారుజామున ఓ ఇంటికి సమీపంలో పార్కింగ్ చేసిన కారు దగ్ధమైంది. ప్రమాదవశాత్తు జరిగిందా? ఎవరైనా ఉద్దేశపూర్వకంగా నిప్పుపెట్టారా? అనేది తెలియరాలేదు. కారుకు సమీపంలో ఉన్న మోటారుబైక్‌కు సైతం మంటలు వ్యాపించడంతో పాక్షికంగా దెబ్బతింది. సమాచారం అందుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

భారీ మెజారిటీనే అందరి లక్ష్యం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

- కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

ఇందుకూరుపేట : రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజలకు మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి కోరారు. మండలంలోని మొత్తలు గ్రామంలో మండలంలోని నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ఎన్నికల్లో ఇందుకూరుపేట మండలం నుంచి తొమ్మిది వేలకుపైగా ఆధిక్యత అందించారని, అందరూ కలిసికట్టుగా పనిచేయడం వల్లే ఇంత మెజారిటీ సాధించామన్నారు. అర్హులైన ప్రతి పేదవానికి ప్రత్యక్ష నగదు బదిలీ విధానం ద్వారా(డీబీటీ) మండలంలోని లబ్ధిదారుల ఖాతాల్లో రూ.356.82 కోట్ల నగదు వేయగా, నాన్ డీబీటీ ద్వారా మరో రూ.107 కోట్లు కలిపి మొత్తం రూ.464.07 కోట్ల అందించామన్నారు. మండలంలో సొంత ఇళ్లు లేని 1,621 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన ఘనత మనకే దక్కిందన్నారు. అలాగే 455 మందికి పైగా పొజిషన్ సర్టిఫికెట్లు ఇచ్చామన్నారు. ఫ్రెష్ అసైన్‌మెంట్ కింద మండలంలో 107 మంది రైతులకు 90 ఎకరాలకు పూర్తి యాజమాన్య హక్కులు కల్పించి వారి కళ్లల్లో ఆనందం నింపామన్నారు. 180 ఎకరాల చుక్కల భూములకు శాశ్వత పరిష్కారం కల్పిస్తూ 75 మంది రైతులకు 1–బి సర్టిఫికెట్లను ఇచ్చామన్నారు. నియోజకవర్గంలో రూ.1000 కోట్లకు పైగా సంక్షేమ పథకాలు అందించారని, ఇలాంటి పరిపాలన అందించిన వారు గతంలో ఎవరూ లేరన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేయడం మనందరి బాధ్యత అని తెలిపారు. చిన్నపాటి మనస్పర్థలు ఉంటే పక్కన పెట్టి పార్టీ గెలుపు కోసం పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు నల్లపరెడ్డి రజత్‌కుమార్‌రెడ్డి, జొన్నవాడ ఆలయ చైర్మన్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్‌కుమార్, ఇందుకూరుపేట రూరల్ బ్యాంక్ చైర్మన్ గునుపాటి సురేష్‌రెడ్డి, బట్టేపాటి నరేంద్రరెడ్డి, ఎంపీపీ గందళ్ల శంకరయ్య పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్త పరీక్షలు


రక్త పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

కొడవలూరు : స్థానిక గిరిజన బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్త శాతం తక్కువ ఉన్న విద్యార్థులను గుర్తించి ఐరన్ మాత్రలు వేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి వైద్యాధికారి ఎం.రామకృష్ణ మాట్లాడుతూ రక్తహీనత సమస్య తలెత్తితే ఎదుగుదలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. రక్త శాతం తక్కువగా ఉన్న విద్యార్థులు ఐరన్ మాత్రలు క్రమం తప్పకుండా వినియోగించడం ద్వారా సమస్యను అధిగమించవచ్చన్నారు. ఆరోగ్యకర ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల ప్రిన్సిపల్ పి.దేవసహాయం, హెచ్‌ఏ షఫీఉద్దీన్, ఎంఎల్‌హెచ్‌పీలు రషీద, స్నేహ, సరోజ, ఏఎన్ఎం సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్


మెటీరియల్స్ చూపుతున్న ఉపాధ్యాయులు

మనుబోలు : మండలంలోని వీరంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఐపీఆర్ మెమోరియల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు యూటీఎఫ్ స్టడీ మెటీరియల్స్‌ను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు బద్దెపూడి శీనయ్య మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించేందుకు అనుగుణంగా ఈ స్టడీ మెటీరియల్స్ దోహదపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు అనిల్‌కుమార్, మహేంద్రబాబు, అధ్యక్షుడు మోహన్‌రావు, యూటీఎఫ్ కమిటీ సభ్యుడు ఏడుకొండలు, హెచ్‌ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

‘ఇన్‌స్పైర్’లో నిడిగుంటపాళెం విద్యార్థిని ప్రతిభ


గైడ్ టీచర్‌ను సన్మానించి, విద్యార్థిని నిఖితను అభినందిస్తున్న హెచ్‌ఎం చలపతి

వెంకటాచలం: నెల్లూరు నగరంలో మంగళవారం జరిగిన ఇన్‌స్పైర్ మనక్ సైన్స్ ఎగ్జిబిషన్‌లో నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పిట్ల నిఖిత ప్రతిభ చూపింది. ఆమె ప్రిపేర్ చేసి ప్రదర్శించిన ‘వెహికల్ స్పీడ్ కంట్రోల్ ఇన్ డేంజర్ జోన్’ ప్రాజెక్ట్ రాష్ట్రస్థాయికి ఎంపికైంది. దీంతో బుధవారం ఉదయం నిడిగుంటపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో నిఖితను, గైడ్ టీచర్‌గా వ్యవహరించిన సీహెచ్.వి.శ్రీధర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చలపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.